
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం


మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | సోమవారం 21 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# మే 2న అమరావతి ప్రధాని మోదీ



- ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించాం
- సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయి
- అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం
- గత ఐదేళ్లు రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది
- మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష



**అమరావతి**

ప్రధాని మోదీ పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఏపీ మంత్రులు తెలిపారు. ఏపీ పర్యటనలో భాగంగా మే 2న సాయంత్రం 3 గంటలకు ఆయన గన్నవరం చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు - మిగతా3లో

## ఏపీలో గుజరాత్ తరహా క్రికెట్ స్టేడియం

పరిశీలించిన మంత్రి నారాయణ బృందం

పర్యటన పూర్తవడంతో విజయవాడకు తిరుగు పయనం



**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 21):**

ఆంధ్రప్రదేశ్‌లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాలనే ఉద్దేశంతో అక్కడి స్టేడియాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ బృందం సోమవారం అక్కడి నరేంద్ర మోడీ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ సిటీని పరిశీలించారు. అమరావతి నిర్మాణంలో భాగంగా పలు కట్టడాలు, ప్రాంతాల అధ్యయనానికి రెండు రోజుల గుజరాత్ పర్యటనకు మంత్రితో కూడిన అధికారుల బృందం మూడు రోజులుగా గుజరాత్ రాష్ట్రంలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్యాస్పూర్ లో జిందాల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ఘన వ్యర్థాల నుంచి విద్యుత్, పేవర్ బ్లాక్స్ తయారుచేసే విధానాన్ని పరిశీలించారు. ప్రతి రోజూ పెద్ద ఎత్తున వస్తున్న ఘన వ్యర్థాలను డికంపోజ్ చేసే విధానాన్ని అక్కడి అధికారులు వివరించారు. కేవలం 9 నెలల్లోనే స్టేడియంను నిర్మించిన విధానాన్ని వివరించిన గుజరాత్ క్రీడల శాఖ అధికారులు. పర్యటన ముగియడంతో విజయవాడ తిరుగు ప్రయాణం అయ్యారు.



## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

### 202 మీటర్లు పూర్తైన డయాఫ్రమ్ వాల్

### మీడియాతో జన వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**(అంకుశం, రాజమండ్రి, ఏప్రిల్ 21):**

పోలవరం ప్రాజెక్టు పనులను 2027 చివరి నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ కు సంబంధించి ఇప్పటివరకు 202 మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు డయాఫ్రం వాల్ జగన్ పాలనలో విధ్వంసానికి గురికాగా నేడు కూటమి ప్రభుత్వంలో నిర్మాణం దశగా పనులు సాగుతున్నాయన్నారు. - మిగతా2లో



## దళితుల సామాజిక బహిష్కరణను ఖండిస్తున్నాం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.**

**అంకుశం ప్రతినిధి విజయవాడ ఏప్రిల్ 21**



కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, మల్లాం గ్రామంలో దళితులను సామాజిక బహిష్కరణ చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో పెత్తందార్లు దళితులను సామాజిక బహిష్కరణకు గురిచేయడం దుర్మార్గం. విద్యుత్ఘాతంతో మరణించిన దళిత యువకుడి కుటుంబానికి పెద్దలు రాజీ కుదిర్చిన మేరకు పరిహారం ఇవ్వకపోగా, పెత్తందార్లు దళిత కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. నాగరిక సమాజంలో ఇటువంటి సామాజిక రుగ్మతలు, సాంఘిక బహిష్కరణలు గర్హనీయం. ఈ రోజు సిపిఐ తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల కార్యదర్శులు కామ్రేడ్స్ టి.మధు, బోడ కొండ తదితర సిపిఐ ప్రతినిధి బృందం మల్లాం గ్రామం వెళ్లి దళితులను పరామర్శించడం జరిగింది. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి, ఈ ఘటనపై తగు చర్యలు చేపట్టాలి. గ్రామంలో దళితులకు రక్షణ కల్పించాలి. సామాజిక బహిష్కరణ అమలు చేసిన పెత్తందార్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం. విద్యుత్ఘాతం వల్ల చనిపోయిన దళిత యువకుని కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరుతున్నాం.

## నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగాల కల్పన

### శిక్షణా కాలంలో భోజన, వసతి, యూనిఫామ్ అందజేత

### సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి

**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 21)**

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున సీడాప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించటంతోపాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం - మిగతా2లో



# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు



**కాకినాడ :** తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్జిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్జిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏ?రపిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్జిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# కారుమూరి మెడకు 690 కోట్ల టీడీఆర్ స్కాం



**ఏలూరు :** ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు జిల్లా వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్ కూటమి ప్రభుత్వంతో పాటు మళ్ళీ పాత కేసులను బయటకు తోడేలా చేసేయంటూ టాక్ విన్పిస్తోంది.ఇటీవల ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు చేసిన వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో వైసిపిపై దాడులు చేస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వరకు ఇంటి నుండి బయటకు లాగి కొడతామనీ, గుంటూరు తర్వాత నరికి చంపేస్తామని కారుమూరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో పెను దుమారాన్నే రేపుతున్నాయి. ఈ కామెంట్స్ పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కూటమి నేతలంతా తీవ్రంగా స్పందించారు. తణుకు నియోజవర్గంలో కొందరు టిడిపి నాయకులు కారుమూరి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.ఎప్పుడు సైలెంట్ గా ఉండే కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సైతం కారుమూరి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలో జరిగిన సభలో మాట్లాడుతూ? రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్న హెచ్చరించిన వర్మ?ఆ తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సభలో మాత్రం కారుమూరిపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే చేతులు, కాళ్లు నరికేస్తానంటూ కేంద్రమంత్రి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.ఎవరినైనా చంపడానికి చేతులు లేకుండా, నడవడానికి కాళ్లు లేకుండా చేస్తానంటూ కారుమూరిని హెచ్చరించారు. ఎఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతి చేసిన కారుమూరి నాగేశ్వరరావు త్వరలో జైలుకెళ్లడం ఖాయం అన్నారు. అయితే వర్మ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇక కారుమూరి నాగేశ్వరరావు జైలుకి వెళ్లడం తప్పదంటూ రకరకాల టాక్స్ పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. నెక్స్ లిస్టులో కారుమూరి పేరు ఉందంటూ ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారట.ఎఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతికి కారుమూరి పాల్పడ్డారంటూ కేంద్ర మంత్రి వర్మ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిగ్గా మారాయి. టీడీఆర్ బాండ్ల స్కాంలో అసలేం జరిగిందంటూ ఇప్పుడు అంతా ఆరా తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి..తన సొంత నియోజకవర్గమైన తణుకు పట్టణంలో అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున సేకరించిన భూములపై ప్రస్తుత తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆరా తీస్తున్నారంట.తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల స్కాంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. వాస్తవానికి 2014 నుండి 19 వరకు అప్పటి తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తణుకు పట్టణ అభివృద్ధి కోసం 6వేల గజాలకు బాండ్లు ఇచ్చారు. అయితే 2019 నుండి 24 వరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఏకంగా 6 లక్షల గజాల వరకూ బాండ్లు ఇవ్వడంతో తీగలాగితే డొంక కదిలింది అన్నట్లు రాష్ట్రంలోనే భారీగా టీడీఆర్ బాండ్స్ స్కాం బయటపడేందుకు కారణమైందట.ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఏసీబీ విచారణ పూర్తయిందని..త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందట. అయితే ఏసీబీ నివేదికలో కారుమూరి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఆయన జైలుకెళ్లడం తప్పదనే చర్చ జరుగుతోంది. అయితే ఏసీబీ సమర్పించే నివేదికలో ఏముందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## భూ రిజిస్ట్రేషన్ల ఆదాయానికి గండి

-మొదటిపేజీ తరువాయి

ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేక పోయాయి.

**తగ్గిన డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు**

విజయనగరం జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు 75,494 వరకు జరగ్గా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 71,977 జరిగాయి. గత ఏడాదితో పోల్చిచూస్తే 3,517 వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 2023-24లో 18,462 డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు జరగ్గా 2024-25లో 18,202 వరకు జరిగాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే 260 వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయి.

**మరింత మెరుగైన సేవలు**

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకురావడంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయి. దీనిపై ప్రజల్లో స్పందన పెరుగుతుంది. కార్యాలయాల్లో రద్దీ తగ్గి రిజిస్ట్రేషన్ పనులు త్వరగా పూర్తవుతాయి. సిబ్బందిపై ఒత్తిడి, దళారుల ప్రభావం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం మరింత పెంపునకు కృషి చేస్తున్నాం.

# జూన్ 12 నాటికి 3 లక్షల గృహప్రవేశాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తున్న విషయం తెలిసిందే.బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సాయం అందిస్తున్నారు. గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హౌసింగ్) అజయ్ జైన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. పనులను గడువులోగా పూర్తి చేసేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను 990 కోట్లతో జనవరి 18న మొదలుపెట్టామని తెలిపారు. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రమ్ వాల్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి అన్నారు. ఏప్రిల్ 30 కల్లా మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామును, బలోపేతం చేయడానికి బట్రస్ డ్యాం, మే నెలకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. డయాఫ్రం వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, సమాంతరంగా గ్యాప్%-%1 వద్ద, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణాన్ని ఏప్రిల్ నెలలో మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. గ్యాప్%-%2 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్%-%30 లోగా మొదలు పెట్టేలా, చంద్రబాబు ప్రణాళికలను అమలు చేస్తామని, వచ్చే 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. చంద్రబాబు ఇటీవల జరిపిన రివ్యూలో 2027 లో గోదావరి పుష్కరాలు ఉన్నందున ఆ ఏడాది జూన్ కల్లా పూర్తయ్యేలా చూడాలని చెప్పారని, సాధ్యమైనంత వరకు అప్పట్లో గా పూర్తయ్యేందుకు పనులను వేగవంతం చేస్తామని లేనియెడల అనుకున్న లక్ష్యానికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. గత జగన్ ప్రభుత్వంలో లెఫ్ట్ కెనాల్ కు అర బస్తా సిమెంట్ గాని, రూపాయి పని నోచుకోలేదు అన్నారు. కుటమి ప్రభుత్వం 1200 కోట్లతో టెండర్లు పిలవడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గోదావరి వరద జలాలు లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు, తరలిస్తామని, తద్వారా ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగాల కల్పన

-మొదటిపేజీ తరువాయి

ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో వారికి ఉచితంగా భోజనంతోపాటు వసతి, యూనిఫామ్ మరియు కోర్స్ మెటీరీయల్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అందులో భాగంగా సీడాప్ కూడా తనవంతు పాత్రిని నిర్వహిస్తుందన్నారు. ఒక వైపు డీఎస్సీ ద్వారా వేల ఉద్యోగాలు ఇంకోపక్క సీడాప్ ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన తరువాత లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం చాలా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలు ఏర్పడుతుందన్నారు. ఈ అవకాశాలను రాష్ట్రంలోని యువత అందిపుచ్చుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుచున్నామని ఆ ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివరాలకు 0866%-%2571125, 80088 79191 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## మోదీ పర్యటనతో అమరావతి పనులు ఊపందుకుంటాయి

-మొదటిపేజీ తరువాయి

పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోదీ గంటపాటు ఉంటారని చెప్పారు. గత ఐదేళ్ల రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని, అందువల్ల రైతులను కూడా గౌరవించుకోవాలని నాదెండ్ల మనోహర్ అన్నారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పునఃప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తారని అన్నారు.

## ఏపీ సిట్ అధికారుల అదుపులో రాజ్ కేసిరెడ్డి

**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాజ్ కేసిరెడ్డిని ఏపీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సిట్ విచారణకు హాజరయ్యేందుకు దుబాయ్ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ క్రమంలో రాజ్ కేసిరెడ్డిని ఏపీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, విజయవాడకు తరలిస్తున్నారు.

**అంతకుముందు రాజ్ కేసిరెడ్డి ఆడియో విడుదల**

మంగళవారం సిట్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో రాజ్ కేసిరెడ్డి ఓ ఆడియోని విడుదల చేశారు. అందులో 'నేను రేపు(మంగళవారం) సిట్ విచారణకు హాజరవుతున్నాను. రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు సిట్ ఆఫీసుకు వస్తానని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చాను. నా ముందస్తు బెయిల్ అంశానికి సంబంధించి హైకోర్టులో వాదనలకు సమయం పట్టేలా ఉంది. కాబట్టి సిట్ విచారణకు హాజరవుతున్నాను' అని పేర్కొన్నారు.

**రెండురోజుల క్రితం విజయసాయి రెడ్డిపై**

రెండురోజుల క్రితం విజయసాయి రెడ్డిపై రాజ్ కేసిరెడ్డి ధ్వజమెత్తారు. విజయసాయి చెప్పే మాటలు నమ్మొద్దంటూ మీడియాకు రాజ్ కేసిరెడ్డి ఆడియో విడుదల చేశారు. త్వరలోనే విజయసాయి బండారం బయటపెడతానన్నారు. పోలీసుల విచారణకు సహకరిస్తానని తెలిపారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత పోలీసులకు సహకరిస్తానని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా తనపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. "సిట్ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించా. మార్చిలో సిట్ అధికారులు మా ఇంటికి వచ్చారు. నేను లేనప్పుడు మా అమ్మకు నోటీసులు ఇచ్చారు. సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశా' అని గత ఆడియోలో పేర్కొన్నారు రాజ్ కేసిరెడ్డి.

## శంకర్ విలాస్ ఆర్వోబీ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదు

**గుంటూరు:** కేంద్రం మద్దతుతో నెలల వ్యవధిలోనే శంకర్ విలాస్ ఆర్వోబీ అనుమతులు తీసుకొచ్చామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శంకర్ విలాస్ పైవంతెన కోసం భవనాలు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేసి మాట్లాడారు. కొందరు కావాలని ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని పెమ్మసాని ఆరోపించారు. వంతెన నిర్మాణం ముందుకెళ్లకుండా చేయడమే కొందరి ఆలోచన అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ వంతెన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు.

## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

సాగుతున్నాయన్నారు. కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను 990 కోట్లతో జనవరి 18న మొదలుపెట్టామని తెలిపారు. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రమ్ వాల్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి అన్నారు. ఏప్రిల్ 30 కల్లా మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామును, బలోపేతం చేయడానికి బట్రస్ డ్యాం, మే నెలకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. డయాఫ్రం వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, సమాంతరంగా గ్యాప్%-%1 వద్ద, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణాన్ని ఏప్రిల్ నెలలో మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. గ్యాప్%-%2 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్%-%30 లోగా మొదలు పెట్టేలా, చంద్రబాబు ప్రణాళికలను అమలు చేస్తామని, వచ్చే 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. చంద్రబాబు ఇటీవల జరిపిన రివ్యూలో 2027 లో గోదావరి పుష్కరాలు ఉన్నందున ఆ ఏడాది జూన్ కల్లా పూర్తయ్యేలా చూడాలని చెప్పారని, సాధ్యమైనంత వరకు అప్పట్లో గా పూర్తయ్యేందుకు పనులను వేగవంతం చేస్తామని లేనియెడల అనుకున్న లక్ష్యానికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. గత జగన్ ప్రభుత్వంలో లెఫ్ట్ కెనాల్ కు అర బస్తా సిమెంట్ గాని, రూపాయి పని నోచుకోలేదు అన్నారు. కుటమి ప్రభుత్వం 1200 కోట్లతో టెండర్లు పిలవడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

# తోపుదుర్తిచేసిన నిర్వాకానికి మేము ఇబ్బందులు పడుతున్నాం





- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో రైతుల ఆవేదన
- ఎయిర్ పోర్ట్ నిర్మిస్తే విలువైన భూములు కోల్పోతామన్న రైతులు
- రైతుల సమస్యలను కలెక్టర్ తో కలిసి ఓపికగా విన్న సునీత
- ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే సునీత హామీ

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 21:** మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి చేసిన నిర్వాకానికి తాము బ్యాంకు రుణాలు రెన్యూవల్ చేసుకోలేక ఇబ్బంది పడుతున్నామని పలువురు రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పరిటాల సునీత జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయనపల్లి గ్రామం వద్దనున్న ఆర్.జె.సి కల్యాణ మండపంలో రాప్తాడు నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్.వి, తో కలిసి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ పాల్గొని ప్రజల నుంచి 407 అర్జీలను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా తలుపూరు దగ్గర ఎయిర్ పోర్టు నిర్మిస్తే విలువైన భూములు కోల్పోతామని రైతులు కలెక్టర్ ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకువచ్చారు. అయితే వీటిపై అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత నిర్ణయం ఉంటుందని ఇప్పటికైతే ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. వంకపోరంబోకులో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వమని అనంతపురం శివారు కాలనీ వాసులు విన్నవించారు. హంద్రీ నీవా కాలువ లైనింగ్ వద్దని ఆత్మకూరు మండలం సిద్దరాంపురం రైతులు విన్నవించగా... తోపుదుర్తి రిజర్వాయర్ నిర్మిస్తామని భూసేకరణ పేరుతో 150మంది రైతులనుంచి సుమారు 720ఎకరాల భూముల్ని ఆన్ లైన్ లో హెూల్డ్ లో ఉంచారని.. ఈ పొలాలపై గతంలో రుణాలు పొందామని... రెన్యూవల్ కి వెళితే బ్యాంకు అధికారులు నిరాకరిస్తున్నారు. పొలాలు ఆన్ లైన్ లో కనిపించక రెన్యూవల్ చేసుకోలేక ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అ భూముల్ని హెూల్డ్ లో నుంచి తీసివేయాలని రైతుల కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. మూడు మండలాలలో విద్యుత్ ట్రాన్స్ఫర్మర్స్ ఇస్తున్నారు. మెటీరియల్ కండక్టర్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాప్తాడులో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించినందుకు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు భూ సమస్యలు, నీటి సమస్యలు, పింఛన్ కావాలని, ఇండ్ల పట్టాలు, రేషన్ కార్డులు, ఇండ్లు కావాలని, ఇలా పలు రకాల సమస్యలతో అర్జీదారులు వచ్చారని, వాటిని జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అలాగే మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా



కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ వచ్చిన ప్రతి అర్జీదారులతో ఓపికతో సావధానంగా వినడం జరిగిందని, అలాగే అనంతపురం జిల్లాలో మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా అభినందించదగ్గ విషయమని తెలిపారు. జిల్లా కేంద్రానికి గ్రామాలలో, మారుమూల పల్లెల ప్రాంతాల నిరుపేద ప్రజలకు వారి సమస్యలను తెలియజేయుటకు వ్యయప్రయాసలు పడి వస్తున్నారనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ ఏ మండలాల పరిధిలో ఉన్న సమస్యలను ఆ మండలాలలో తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, తద్వారా పేద ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు మంచి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అలాగే రెవెన్యూ మరియు ఇతర శాఖల సంబంధించిన పలు రకాల సమస్యలను ఈ నియోజకవర్గ ప్రజలు జిల్లా కలెక్టర్ తెలియజేయడం జరిగిందని, వారు ఈ సమస్యలను ప్రభుత్వం, జిల్లా అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

# రాష్ట్ర చరిత్రలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది





- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అభ్యర్థులు.
- సీఎం చంద్రబాబుకు ,మంత్రి లోకేష్ కు డీఎస్సీ అభ్యర్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మంత్రి సవితమ్మ

**అంకుశం న్యూస్ అమరావతి ఏప్రిల్ 21:** సోమందేపల్లి : కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇది చేతుల ప్రభుత్వం అని మంత్రి సవితమ్మ తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటం కు పాలాభిషేకం చేసిన డీఎస్సీ అభ్యర్థులు ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ విద్యా రంగంలో అనేక సంస్థలకు మంత్రి లోకేష్ స్వీకారం చుట్టాల న్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని మంత్రి తెలిపారు..ఈ విద్యా సంవత్సరంకు ముందుగానే డీఎస్సీ నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు.డీఎస్సీ అంటే చంద్రబాబు ,చంద్రబాబు అంటే డిఎస్సీ .అని రాష్ట్ర చరిత్రలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి తొలి సంతకం చేశారని తెలిపారు .గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు మూడు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ హడావిడి చేసి నిరుద్యోగులను దగా చేశారన్నారు. ఇప్పటికే 26 జిల్లాల్లోనూ ఉచిత డిఎస్సి కోచింగ్ సెంటర్లు నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ విధానం తెచ్చింది కూడా టిడిపి ప్రభుత్వమని, వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను బార్లు, బ్రాందీ షాపుల దగ్గర కాపలా పెట్టారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ అభ్యర్థులు మరియు పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## మాజీ ఎంపీ సైపుల్లాను పరామర్శించిన అనంత వెంకటరామిరెడ్డి



**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 21:** మాజీ రాజ్యసభ సభ్యులు కేఎం సైపుల్లాను వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. సైపుల్లా కుమారుడు కేఎం జక్కీవుల్లా గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలియడంతో సైపుల్లా ఇంటికి వెళ్లిన అనంత.. ఆయన్ను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా అనంతపురం నగరంలో జక్కీవుల్లా చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఓ మంచి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన చెందారు. పేదలకు సాయం అందించే విషయంలో జక్కీవుల్లా ముందుండేవారని తెలిపారు. కేఎం సైపుల్లా కుమారుడు రహంతుల్లా చిన్న వయసులోనే మృతి చెందారని, ఇప్పుడు మరో కుమారుడు జక్కీవుల్లా దూరం కావడం బాధాకరమన్నారు. మనోధైర్యం కోల్పోవద్దని సైపుల్లాకు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు.

## పట్నం ప్రబులు తున్న మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల సమీక్ష



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 21:** పట్టణ ఆరోగ్య కేంద్రం ముచ్చిమిల్లి, రామచంద్రపురం ను జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సందర్శన చేసి ప్రతి నెల చేసే ల్యాబ్ పరీక్ష వివరములను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వివరములు అడిగి తెలుసుకున్నారు. తదుపరి రామచంద్రపురం పట్టణపు ఏఎన్ఎంల, ఆశాల సమావేశములో డెంగ్యూ, మలేరియా వంటివ్యాధులు రాకుండా యాంటీ లార్వాల్ ఆపరేషన్ లను చేపట్టాలని , నిల్వయున్న మంచినీటిలో దోమలు గుడ్లు పెడతాయని వాటిని లార్వాదశలోనే నిర్మూలము చేయాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రత పాటించాలని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా టెస్టులకు సంబంధించిన టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ , పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హేమ సుధీర్ ,డాక్టర్ వీరభద్రారెడ్డి , డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు , సబ్ యూనిట్ ఆఫీసర్ సత్యనారాయణ , సూపర్వైజర్ బి మరియమ్మ మరియు వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ ఒలంపియాడ్ 200పరీక్షల్లో బంగారు పతకాలు



**రాప్తాడు, అంకుశం న్యూస్ ఏప్రిల్ 21:** నేషనల్ ఒలంపియాడ్ పరీక్షలలో మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించారని ఇది తమ పాఠశాలకు గర్వకారణమని ఆ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణసమీరా, ఎండి కృష్ణభరత్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ నేషనల్ టాలెంట్ టెస్ట్ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన మాంటిస్సోరి విద్యార్థులు సోమవారం పాఠశాలలో సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి వారి విజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి, వారి ప్రగతికి ఈనైపుణ్య పరీక్షలు నిదర్శనమన్నారు. నేషనల్ ఒలంపియాడ్ పరీక్షలు మొదటి బహుమతి పొందిన వై.సమ్రిత్ రెడ్డి ఎస్.వెన్నెల అనే విద్యార్థులకు ట్యాబ్ లను, రెండవ బహుమతి పొందిన జే.హితీక్ష, జీ.షణ్ముఖ ప్రియా, వైష్ణవిలకు స్మార్ట్ వాచ్ లను, తృతీయ బహుమతి పొందిన వై నిహంత్, పద్మశ్రీలకు హెడ్సెట్ లను బహూకరించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ ప్రతాపరెడ్డి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

## కర్ణాటక మాజీ డీజీపీ హత్య

- కళ్లల్లో కారం పొడి చల్లి ఘాతుకానికి పాల్పడ్డ భార్య
- ఆస్తి వివాదాలే కారణం



**(అంకుశం, బెంగళూరు, ఏప్రిల్ 21):** కర్ణాటక రాష్ట్ర మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) దారుణ హత్యకు గురయ్యారు. ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఓం ప్రకాశ్, ఆయన భార్య పల్లవి గొడపడ్డారు. అది తీవ్రరూపం దాల్చడంతో పల్లవి ఆయనపై కారప్పొడి చల్లి, కట్టేసిందని, తర్వాత అతడిని పొడిచి చంపిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆమె ఒక గ్లాస్ బాటిల్‌ను ఉపయోగించిందని చెప్పారు. తర్వాత నిందితురాలు మరో పోలీసు అధికారి భార్యతో మాట్లాడారు. తన భర్తను తానే చంపేసినట్లు చెప్పారు. దాంతో వారు వెంటనే ఈ ఘటన గురించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో బహిర్గతమైంది.

## పదో తరగతి విద్యార్థులకు గుడ్ న్యూస్

- ఎల్లుండి ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల




**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 21):** ఆంధ్రప్రదేశ్‌లో గత నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్ష ఫలితాలను బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్ (మనమిత్ర), లీప్ యాప్ లలో ఫలితాలు అందుబాటులో ఉంటాయన్నారు.

## అనంతపురం జిల్లా జడ్జి ఈ.భీమారావుని మర్యాద పూర్వకంగా కలిసిన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్



**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 21:** అనంతపురం నగరంలోని జిల్లా కోర్టులో సోమవారం సాయంత్రం నూతనంగా జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా జడ్జి ఈ.భీమారావు గారిని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ గారు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఏప్రిల్ 21:**జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమానంతరం ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ కన్వర్జేన్స్ సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి) సభ్యులు, వంటవారు, సహాయకులు, ప్రభుత్వ రాత్రి వాచ్మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్వాడీ సహాయకులు/ ఆయాలు మరియు ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత మరియు డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారించి ఈ కార్యక్రమం విమాత్నంగా అమలు చేయబడుతోందన్నారు. 2025-26లో జిల్లాలో మొత్తం 33 749మందికి సాక్షరత తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించడం జరగగా, అందుకు అనుగుణంగా లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల మహిళలు సంతకం పెట్టలేని పరిస్థితి ఆయా సంఘాల్లో ఉందని, వారు సంతకం పెట్టేలా, చదవగలిగేలా చూడాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16వ తేదీ నుంచి ఆరు రోజులపాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉందని, సర్వే చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ సారథి , పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, DRDA పిడి నరసయ్యఅడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జకీవుల్లా పార్థివ దేహాన్ని

# మోసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





**- అంత్యక్రియలు ముగిసే వరకు జకీవుల్లా వద్దనే ఉన్న ఎమ్మెల్యే**

**- పాడెమోస్తూ..జకీవుల్లా పై తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే**


**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 21:** ఎన్నికల్లో వెన్నంటే ఉంటి నా గెలుపు కోసం కష్టపడి ఇప్పుడు విడిచి వెళ్లిపోయావా మిత్రమా అంటూ జకీవుల్లా మృతిపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉద్వేగానికి గురయ్యారు. ఆదివారం రోజు గుండెపోటుతో అకాల మరణం చెందిన జకీవుల్లా పార్థివదేహాన్ని హైదరాబాద్ నుంచి అనంతపురంలోని తన నివాసానికి తరలించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశుడు యాదవ్, మంత్రి సవిత లతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి జకీవుల్లా ఇంటికి వెళ్లారు. ఆయన పార్థివ దేహం పై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ సైపుల్లాకు, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జకీవుల్లా మృతితో తన కార్యక్రమలన్నీ రద్దు చేసుకున్నారు. ఉదయం నుంచి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఆయన అక్కడే ఉండిపోయారు. జకీవుల్లాను చివరిసారి చూసేందుకు వచ్చిన ప్రతి ఒక్కర్నీ కలుస్తూ కార్యక్రమం చివరకు ఎమ్మెల్యే అక్కడే కనిపించారు. అంతిమయాత్రలో జకీవుల్లా పార్థీవదేహాన్ని మోస్తూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని చాటుకున్నారు. అశోక్ నగర్ లోని ఖబరస్తాన్ లో అంత్యక్రియలు పూర్తయ్యే దగ్గుపాటి వారి కుటుంబం వెంట ఉన్నారు. అంతిమయాత్రలో జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రచార సమయంలో జకీవుల్లాతో కలిసిన ప్రయాణం ప్రారంభమైందని తన గెలుపు కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అలాంటి నేత ఇలా అకాల మరణం చెందడం చాలా బాధాకరమని దగ్గుపాటి ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లపాటు తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను ఐక్యంగా ఉంచుతూ యువ గళం పాదయాత్రలో కీలకంగా వ్యవహరించిన జకీవుల్లా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పెనుకొండ బాబయ్య దర్గా వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం డోన్ ఇన్చార్జిగా, అబ్జర్వర్ గా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించేవారున్నారు. పార్టీలో ఎంతో యాక్టివ్ గా ఉండే జకీవుల్లా ఇంత హఠాత్తుగా మరణించడం.. తనతో పాటు కార్యకర్తలు కూడా జీర్ణించుకోలేక - పోతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జకీవుల్లా మరణం పార్టీకి తీరని లోటని ఆయన కుటుంబం వెంట పార్టీ ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

## శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశ్వీరచనంతో ముగిసిన మూడు రోజుల శ్రీ గీతా మందిర మహా సంప్రోక్షణ కుంభాభిషేకం

**- చివరి రోజున కల్యాణోత్సవానికి హాజరైన వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి**

**- మూడు రోజులపాటు ఆధ్యాత్మిక శోభను సంతరింప చేసుకున్న నున్న**

**అంకుశం న్యూస్ విజయవాడ ఏప్రిల్ 21:** విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ గీతా మందిరంలో మూడు రోజుల పాటు జరిగిన మహా సంప్రోక్షణ కుంభాభిషేకం ఆధ్యాత్మిక శోభను పురస్కరించుకుంది. శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనంతో మూడు రోజుల మహా సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ పవిత్ర కార్యక్రమం దైవిక కలయికను చూసేందుకు, దీవెనలు పొందేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు నున్నకు తరలివచ్చారు. తిరుపతి సమీపంలోని ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమానికి చెందిన పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాదికారి శ్రీ అసంగానందగిరి స్వామి, వేద పండితుడు రొంపిచర్ల దత్త కుమార్‌తో ఆధ్వర్యంలో వైదిక సంప్రదాయాలను పాటిస్తూ వేద పండితులు శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా శ్రీ గీతా మందిరంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడికి విశేష అలంకారాలు చేసి పవిత్రమైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో విష్వక్సేన పూజ, పునహవాచన, అగ్నిధ్యానం, నిత హెూమం, ఉత్త హెూమం మరియు మహా పూర్ణాహుతి ఉన్నాయి. ఈ పూజా కార్యక్రమాలు పూర్తయిన భక్తులకు దర్శనంతోపాటు శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించే అవకాశం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఎలాంటి రద్దీ లేకుండా ఉండేందుకు నిర్వాహకులు నిర్ణీత క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. శ్రీ గీతామందిర మహా సంప్రోక్షణ కుంభాభిషేకం ముగిసిన అనంతరం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి విశ్వాసం, ధర్మం, భక్తి శక్తి అనే అంశాలను ఉద్ఘాటిస్తూ స్ఫూర్తిదాయకమైన భక్తి ప్రసంగాన్ని అందించారు. సానుకూల ఆలోచనలతో నిండిన జీవితాలను గడపాలని, ఆనందాన్ని దైవిక బహుమతిగా స్వీకరించాలని చెప్పారు. ప్రతి జీవిలో దైవత్వం ఉంటుందని, భగవంతునిపై అచంచలమైన విశ్వాసం ఉంచే వారు కాపాడబడతారని ఆయన తెలియజేశారు. ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం విశేష పాత్రను హైలైట్ చేస్తూ, నిజమైన భక్తుడు గురువుకు కీర్తిని తెచ్చిపెట్టేవాడని, గురుదేవుల నుండి విశ్వాసులకు ఆశీర్వాదాలు ప్రవహించేలా చూస్తాడని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా శ్రీ గీతా మందిర భక్తబృందం 'అన్న సంతర్పణ' నిర్వహించింది. ఇదిలావుండగా, మూడు రోజుల వేడుకలను సజావుగా పూర్తి చేసేందుకు నున్న రూరల్ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టటంతోపాటు చివరి రోజున గ్రామంలోని శ్రీ గీతా మందిరం ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపును అమలు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో విజయవాడ రూరల్ తహశీల్దార్ బి.సుగుణ, నున్న రూరల్ పోలీస్ స్టేషన్ (పాయకాపురం) ఇన్‌స్పెక్టర్ పి కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి జిటివి రమణ, నున్న పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాసరావు సహా స్థానిక ప్రముఖులు విచ్చేశారు. సోమవారం విజయవాడ సమీపంలోని నున్నలో శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాధికారి అసంగానందగిరి స్వామి, అర్చక స్వామి రొంపిచర్ల దత్త కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీ శ్రీనివాస కళ్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. విజయవాడ సమీపంలోని నున్నలో మూడు రోజుల పాటు సాగిన గీతా మందిరం మహా సంప్రోక్షణ కుంభాభిషేకం ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహదాశీర్వచనం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విజయవాడ సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము





**ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి సీసీ రోడ్లు శంకుస్థాపన**

**అంకుశం ప్రతినిధి విజయవాడ : ఏప్రిల్ 21:** ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునీకరణలో విజయవాడ రూపు రేఖలు మారుతున్నాయి.రాజధాని అమరావతి ప్రాంతంలో భాగమైన విజయవాడ నగరాన్ని మరింత సుందరీకరణగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులైన తమతో పాటు, ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. అందులో భాగంలోనే విజయవాడ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరిలతో కలిసి విజయవాడ సమగ్ర అభివృద్ధితో పాటు సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతంలోని రోడ్ నెంబర్ 5కు, భారతి నగర్ లో 13వ,14వ,15వ ,10b,4a రోడ్లకి సుమారు 2కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్ల పనులకు సోమవారం ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారని, అందుకే నగరంలోని రోడ్ల అభివృద్ధి పనులు శరగవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల మంత్రి నారాయణ సీ.ఆర్.డి.ఏ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో నగరంలోని డ్రైనేజీ, ఎస్టీపీ సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు.అదే విధంగా వర్షం పడిన సమయంలో నోవాటెల్ సమీపంలో వున్న రెండు ఫ్లై ఓవర్స్ కి మధ్య రోడ్లపై వర్షం నీరు నిలిచి పోయే విషయం, ఫ్లై ఓవర్స్ కి పైప్ లైన్స్ లేకపోవటం పై నుంచి రోడ్లకి మీదకి నీళ్లు పడే సమస్య నేషనల్ హైవే అధికారుల దృష్టి తీసుకువెళ్లగా త్వరలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. ఇక నేషనల్ హైవే అథారిటీ అధికారులు బెంజ్ సర్కిల్ నుంచి ప్రారంభించాల్సిన డ్రైనేజీ పనులు నెలరోజుల్లో కార్యరూపంలోకి తీసుకువస్తారని తెలిపారు. విజయవాడ నగరాన్ని మరింత సుందరీణ చేసేందుకు ప్రజాప్రతి నిధులందరూ కలిసి కట్టుగా కృషి చేస్తామని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి పర్చుటానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు. నిధుల సమకూర్చి ఈనాలుగున్నరేళ్లలో నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షానికే మునిగిపోయే ఈ ప్రాంతం అభివృద్ధి కోసం సీఆర్డీయే నిధుల నుంచి 200 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. నిడమానురు, కంకిపాడు నుంచి విజయవాడ లోకి సులువుగా వచ్చేందుకు అవుటర్ రోడ్లు నిర్మాణ అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్ల రూపాయలు ఇవ్వటం జరిగిందన్నారు. ఈ నిధులతో ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రాబోయే రోజుల్లో నగరాభివృద్ధి మాస్టర్ ప్లాన్ తో పాటు డి.పి.ఆర్ ఇస్తే అవసరమైతే రెండు వేల కోట్ల రూపాయలు సమకూరుస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు వాగ్ధానం చేశారు. ఆ డిపిఆర్ తయారు చేయటం కోసం ఎంపి కేశినేని శివనాథ్ తో పాటు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో విజయవాడ నగరం భావితరాలకు భవిష్యత్తు ఇచ్చే నగరంగా తయారు కానుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు , కార్పొరేటర్ దేవినేని అపర్ణ ,ఏఈ దీక్షిత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కెఎం జకీవుల్లా కు నివాళులు అర్పించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**అంకుశం న్యూస్ అనంతపురం :21:** మాజీ రాజ్యసభ సభ్యుడు కె ఏం సైపుల్లా రెండవ కుమారుడు తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కే ఏం జకీవుల్లా గుండెపోటు మృతి చెందడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు అనంతపురం రామ్ నగర్ లో ఉన్న కే. ఏం. సై పుల్లా నివాసంలో మృతుడు జాకివుల్లా భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జక్కి పుల్లా మృతిపై వారి కుటుంబ సభ్యులతో సమాచారం అడిగి తెలుసుకున్నారు. జాకీముల్లా మృతి అత్యంత బాధాకరమని ఆయన లేని లోటు ఆ కుటుంబానికి ,మరియు తెలుగుదేశం పార్టీకి అనంతపురం నియోజవర్గ ప్రజలకు తీరని లోటు అన్నారు. జకీవుల్లా మృతి తో శోక సంద్రంలో ఉన్న ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని అల్లా ను కోరుకున్నారు. అనంతరం వారి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, టీడీపీ నాయకులు రాయల్ మురళీ, కృష్ణమోహన్ , లక్ష్మీపతి ,పరమేశ్ , వెంకటప్ప , సింగవరం రవి , స్థానిక పుట్టపర్తి నియోజవర్గ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి ,గంగాధర్ నాయుడు ,బీసీ గంగన్న, రామారావు , కౌన్సిలర్ లక్ష్మీపతి, స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యూపీ సీఎంకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 21:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గారికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహుకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు సోమవారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రిగారు ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ధర్మవరం పట్టు వస్త్రాన్ని, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీ కృష్ణుని తొలుబొమ్మను ఆయనకు బహూకరించి, ధర్మవరం పట్టు గురించి, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్ఠత గురించి ఆయనకు వివరించారు. యోగి ఆదిత్యనాథ్ గారు సత్యకుమార్ గారిని సాదరంగా ఆహ్వానించి మథుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలని, అలాగే ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని సత్యకుమార్ గారు యోగి ఆదిత్యనాథ్ గారిని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## సబ్సిడీపై పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్.

**- అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం**

**- వ్యవసాయ రంగానికి బడ్జెట్లో రూ. 43,402 కోట్లు కేటాయింపు**



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 21:** దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సంసిద్ధంగా ముందుంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం కాజులూరులోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై మంజూరైన పవర్ టిల్లర్స్11, ( చిన్న ట్రాక్టర్లు ), స్ప్రేయర్లు 7 మంది రైతులకు సోమవారం మండల తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రజా పరిషత్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, కూటమి నాయకుల సమక్షంలో మంత్రి లబ్ధిదారులకు అంద చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ దేశంలో 62 శాతం జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ రంగానికి రూ.43 వేల 402 కోట్లు రూపాయలు బడ్జెట్లో కేటాయించిందని అన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ, ప్రకృతి వ్యవసాయం, రైతులకు వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, డిజిటల్ వ్యవసాయం, విత్తనాలకు రాయితీ, ఎరువుల సరఫరా, పంటల భీమా, ఉద్యానవన శాఖ, సహకార సంఘాలకు రుణాలు తదితర రంగాలకు అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చి బడ్జెట్లో కేటాయింపులు చేసి అన్నదాతను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి రైతాంగానికి మధ్య వారదులుగా వ్యవసాయ శాఖ అధికారులు ఉండి, రైతాంగం సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా రాయితీలపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి, మంత్రి సుభాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీవో రాంబాబు, మండల వ్యవసాయాధికారి అశోక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.